క్లుప్తంగా

నేడు పాడేరులో సామూహిక వరలక్ష్మి వ్రతం


ఉమానీలకంఠేశ్వరస్వామి విగ్రహం

సాక్షి,పాడేరు: స్థానిక ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయంలో పవిత్ర శ్రావణమాసం మూడవ శుక్రవారం సామూహిక వరలక్ష్మి వ్రతం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఆలయ ధర్మకర్త కొట్టగుల్లి సింహాచలంనాయుడు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. భక్తులతో పాటు ఆలయ ఆధ్యాత్మిక కమిటీ ఆధ్వర్యంలో సాయంత్రం 5గంటల నుంచి స్వామివారి విగ్రహానికి కుంకుమార్చన పూజలతో పాటు మహిళలంతా సామూహికంగా వరలక్ష్మితల్లి వ్రతం చేస్తారని పేర్కొన్నారు.మహిళలంతా తమ పూజా సామాగ్రితో సాయంత్రం 5 గంటలకు ఆలయాలని చేరుకోవాలన్నారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొవాలని కోరారు.

సీపీఎం సమరభేరి పోస్టర్ ఆవిష్కరణ


సమరభేరి పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సీపీఎం నేతలు

ముంచంగిపుట్టు: మండలంలోని జర్రెల పంచాయతీ డేగలపుట్టు గ్రామంలో సీపీఎం సమరభేరి కార్యక్రమం పోస్టర్‌ను నేతలు గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కె.సురేంద్ర మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలతో సామాన్యులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా ప్రభుత్వ రంగాన్ని నిర్వీర్యం చేస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం వైఖరిపై ప్రజలను చైతన్యం పరుస్తూ, సమరభేరి ద్వారా వివరిస్తామన్నారు. నాయకులు భీమరాజు, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

నాగులగొందిలో భారీ అన్నసమారాధన


అన్నసమారాధనలో గ్రామస్తులు

చింతపల్లి: మండలంలో నాగులగొంది గ్రామంలో చేయూత వారియర్స్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ట్రస్ట్ అధ్యక్షుడు దూనబోయిన రమణ మాట్లాడుతూ ప్రతి నెల మన్యంలో ఎంపిక చేసిన రెండు గ్రామాల్లో గిరిజనులకు ఉచితంగా భోజన సౌకర్యం కల్పిస్తున్నట్టు ఆయన తెలిపారు. సేవా కార్యక్రమాల్లో భాగంగా అన్నసమారాధన చేస్తున్నమన్నారు. ఇందులో భాగంగా రాఖీపౌర్ణమి సందర్భంగా నాగులగొంది గ్రామంలో అన్నసమారాధన చేశామన్నారు. రాజేష్, శేఖర్, మోదగిరి, బిలాస్కార్, ఉమర్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ వర్ధంతి రేపు

అడ్డతీగల: మండల కేంద్రంలో శనివారం దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతిని నిర్వహించనున్నట్టు ఎల్లవరంలో ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు ఒక ప్రకటనలో తెలిపాయి. ఇందులో భాగంగా మండల వ్యాప్తంగా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయం ఎదురుగా ఉన్న వైఎస్సార్ విగ్రహానికి ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు పూలమాలలు వేసి నివాళులర్పిస్తారని పేర్కొన్నారు. అనంతరం పలు సేవా కార్యక్రమాల్లో పాల్గొంటారన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, అభిమానులు ఆయా కార్యక్రమాల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నేటి నుంచి స్వచ్ఛత పక్వాడా

గంగవరం : ఈ నెల ఒకటి నుంచి 15వ తేదీ వరకు జరిగే అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో స్వచ్ఛత పక్వాడా కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని ఎంఈవో మల్లేశ్వరరావు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు ప్రతి పాఠశాలలో పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు.

పేదల బతుకుల్లో సంక్షేమ వెలుగులు

- అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ


పాడి గ్రామంలో ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

డుంబ్రిగుడ: గిరిజన గ్రామాల్లో నెలకొన్న ప్రజా సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకే ప్రతి పల్లెను సందర్శిస్తున్నామని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. డుంబ్రిగుడ మండలం కితలంగి పంచాయతీ పింపోలుగుడ, దేవాలం, పాడి, రంగిసింగ్‌గుడ, చిలిగుడ్డి గ్రామాల్లో గురువారం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా ఆయా గ్రామాల్లో 277 గడపలను ఎమ్మెల్యే సందర్శించారు. ఆయా గ్రామాల్లో ఆయనకు గిరిజన సంప్రదాయంగా స్వాగతం పలికారు. గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్యే ఆయా గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి యోగ క్షేమాలు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలను గిరిజనులకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలను పారదర్శకంగా అమలుచేస్తూ రాష్ట్రంలో పేదల జీవితాల్లో వెలుగులు నింపారన్నారు. ప్రభుత్వం ప్రతి గిరిజన గ్రామంలో మౌలిక సదుపాయాలను కల్పిస్తోందన్నారు. మన్యంలో మునపెన్నడూ లేని విధంగా జగనన్న ప్రభుత్వ హయంలో అభివృద్ధి జరుగుతోందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రతి పథకాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పాడి గ్రామంలో పలు సమస్యలను స్థానికులు ఎమ్మెల్యేకు తెలియజేశారు. దీనిపై ఆయన స్పందించి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం సంబంధిత శాఖాధికారులకు సమస్యలను తెలియజేసి, పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎంపీపీ బాక ఈశ్వరి, జెడ్పీటీసీ సభ్యురాలు జానకమ్మ, వైస్ ఎంపీపీ ఆనందరావు, మండల పార్టీ అధ్యక్షుడు శెట్టి గోపాల్, శెట్టి ఆనందరావు, సర్పంచ్‌లు సుబ్బారావు, వెంకటరావు, నాయకులు సింహాచలం, చిరంజీవి, కృష్ణారావు, ఎంపీటీసీ సభ్యులు విజయ, దేవి, ఎంపీడీవో ఉషారాణి, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా సర్వే వేగవంతం


రెవెన్యూ సిబ్బందికి సూచనలిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసరావు

వై.రామవరం: మండలంలో నిర్వహిస్తున్న ఇంటింటా ఓటర్ల సర్వేను వేగవంతంగా పూర్తి చేయాలని బీఎల్‌ఓలకు, జగనన్న సురక్ష కార్యక్రమంలోని ధ్రువీకరణ పత్రాల జారీపై గ్రామసభల నివేదికలను తక్షణమే సమర్పించాలని రెవెన్యూ సిబ్బందికి తహసీల్దార్ సీహెచ్.శ్రీనివాసరావు ఆదేశించారు. స్థానిక మండల రెవెన్యూ కార్యాలయంలో సిబ్బంది, బీఎల్‌ఓలతోను తహసీల్దార్ శ్రీనివాసరావు గురువారం సమావేశం నిర్వహించారు. ఇంతవరకు మండలంలో బీఎల్‌ఓలు నిర్వహించిన ఇంటింటా ఓటర్ల సర్వేపై రికార్డులు తనిఖీ చేశారు. ఈ సర్వేపై బీఎల్‌ఓలకు సలహాలు, సూచనలిచ్చారు. అనంతరం జగనన్న సురక్ష కార్యక్రమంలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై సిబ్బందిని ఆరా తీశారు, వేగవంతంగా గ్రామ సభలు నిర్వహణ ద్వారా అర్హులందరికీ ధ్రువీకరణ పత్రాలు అందజేయడానికి తక్షణమే గ్రామసభల తీర్మానాలను కార్యాలయానికి అందజేయాలని తహసీల్దార్ ఆదేశించారు. భూముల రీసర్వేపై ఆరా తీశారు. జగనన్న సురక్ష దరఖాస్తుల ధ్రువీకరణ పత్రాలను సుమారు 85 శాతం వరకు లబ్ధిదారులకు జారీ చేశామన్నారు. పెండింగులో ఉన్న 15 శాతం గ్రామ సభల ద్వారా విచారణ నిర్వహించి, త్వరలో అర్హులందరికీ అందజేస్తామన్నారు. మండలంలో ఇంతవరకు 320 మంది కొత్త ఓటర్లను నమోదు చేశామన్నారు. చనిపోయిన, వలస వెళ్లిన 170 మంది ఓటర్లను తొలగించామన్నారు. 430 మంది ఓటర్ల వివరాలను సవరణలు చేశామన్నారు. వీటన్నింటిని రీవెరిఫికేషన్ చేసి, సబ్ కలెక్టర్ కార్యాలయానికి అందజేస్తామన్నారు. గతేగాది జనవరి 6వ తేదీ నుంచి, 2023 ఆగస్టు 17 వరకు మండలంలో తొలగించబడ్డ 827 ఓటర్లపై కలెక్టర్ ఆదేశాల మేరకు రీవెరిఫికేషన్ చేస్తున్నామన్నారు. ఈప్రక్రియ వేగవంతంగా పూర్తి చేసి కలెక్టరుకు నివేదిక పంపిస్తామన్నారు. బీఎల్‌ఓలు, రెవెన్యూ సిబ్బంది స్పందించి, ఈ ప్రక్రియను వేగవంతంగా పూర్తిచేయాలని ఆయన ఆదేశించారు. డిప్యూటీ తహసీల్దార్ కె.సుధాకరరావు, సిబ్బంది, బీఎల్‌ఓలు తదితరులు పాల్గొన్నారు.

నేడు అమ్మవారికి సామూహిక కుంకుమార్చన

అడ్డతీగల: స్థానిక పవనగిరి క్షేత్రంలో శుక్రవారం మహాలక్ష్మి అమ్మవారికి సామూహిక కుంకుమార్చన ఇతర పూజాదికాలు నిర్వహించనున్నట్టు పవనగిరి క్షేత్రం వ్యవస్థాపకులు తణుకు వెంకటరామయ్య తెలిపారు. రుషిపీఠం కల్యాణ మండపంలో నిర్వహించినున్న ఈ కార్యక్రమంలో తొలిత కుంకుమార్చన ఖడ్గమాల, పారాయణం అనంతరం విశేష అర్చనలతో అమ్మవారికి పూజాధికాలు జరుగుతాయని పేర్కొన్నారు.భక్తులు అధిక సంఖ్యలో పాల్గొవాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

జి.మాడుగుల: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ మెయింటెనెన్స్ పనులు నిమిత్తం శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు పాడేరు ఏపీ ఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఏవీఎస్ఎం అప్పారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

ఘనంగా రక్షాబంధన్


పాడేరులో పోస్టల్ ఉద్యోగులకు రాఖీలు కడుతున్న బ్రహ్మకుమారీలు


సోదరుడుకి రాఖీ కడుతున్న సోదరి


అన్న దీవెనలు పొందుతున్న చెల్లెలు


జి.మాడుగులలో ఆంజనేయస్వామి అలయ సన్నిధిలో రక్షాబంధన్ కార్యక్రమం

సాక్షి,పాడేరు: సోదర, సోదరీమణుల అనుబంధానికి ప్రతీకగా నిలిచిన రాఖీ పౌర్ణమి పండగను జిల్లా వ్యాప్తంగా గురువారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా అక్కాచెల్లెలు తమ సోదరులకు హారతి తీసి, బొట్టు పెట్టి, రాఖీలు కట్టి మిఠాయిలు తినిపించారు. సోదరుల ఆశీర్వాదాలు పొందారు. సోదరులు తమ అక్క, చెల్లెమ్మలకు కానుకలు అందజేసి, ప్రేమాభిమానాలను పొందారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాఖీ పౌర్ణమి పండుగ సందర్భంగా ప్రతి ఇంటా సందడి నెలకొంది. పాడేరులో ఈశ్వరీయ విద్యాలయానికి చెందిన బ్రహ్మకుమారిలు పాడేరులోని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలను సందర్శించి అధికారులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులకు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు.స్వీట్లు తినిపించారు.

అరుకులోయరూరల్/డుంబ్రిగుడ/ముంచంగిపుట్టు/హుకుంపేట/జి.మాడుగుల/రాజవొమ్మంగి: జిల్లా వ్యాప్తంగా గురువారం జరిగిన రాఖీ పౌర్ణమి వేడుకల్లో ప్రతి ఇంటా సందడి నెలకొంది. సోదరులకు సోదరీమణులు రాఖీలు కట్టి తమ ప్రేమాభిమానాన్ని చాటుకున్నారు. ఇళ్లల్లో ప్రత్యేక వంటకాలు తయారుచేసి బంధు, మిత్రులను ఆహ్వానించి విందు భోజనాలు చేశారు. ముంచంగిపుట్టు మండలంలోని ఏనుగురాయి పంచాయతీ జంగంసరియా గ్రామంలో కుటుంబసమేతంగా వనభోజనాలు చేశారు. పాడేరు ఓంశాంతి ఆశ్రమ ఇన్‌చార్జి అమ్మలు, ఈశ్వరమ్మ, గణపతి, పడాల్, రాజామ్మలు మండలస్థాయి అధికారులకు రాఖీలు కట్టారు. జి.మాడుగుల మండల కేంద్రంతో పాటు సొలభం పంచాయతీ వనభరంగిపాడు తదితర గ్రామాల్లో నగర సంకీర్తన కార్యక్రమం నిర్వహించారు.పాలకపాటి గురుదేవుల ఆలయంలో పూజ కార్యక్రమం, హోమం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. సమర సత సేవా ఫౌండేషన్ మండల కన్వీనర్ మత్స్యరాజు, విశ్వహిందూ పరిషత్ జిల్లా ధర్మ ప్రచార ప్రముఖ్ అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.


జి.మాడుగులలో నగర సంకీర్తన నిర్వహిస్తున్న భక్తులు


తమ్ముడికి రాఖీ కడుతున్న అక్కలు


డుంబ్రిగుడలో అన్నకు రాఖీ కడుతున్న చెల్లి

తొమ్మిదేళ్ల తర్వాత తోడపెద్దు ఉత్సవం

- మునగపాకలో నేడు, రేపు వేడుకలు
- జిల్లా వ్యాప్తంగా 17 ప్రాంతాల నుంచి తోడపెద్దులతో పాటు సేవగరిడీల రాక


పాలుకొలుపు నిర్వహించే అలయ మండపం (ఇన్‌సెట్) తోడపెద్దు

మునగపాక : మండల కేంద్రంలో ఈనెల 1,2 తేదీల్లో యర్ర వెంకయ్య తోడపెద్దు పాలుకొలుపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. తొమ్మిదేళ్ల తరువాత మునగపాకలో తోడపెద్దుకు పాలుకొలుపు నిర్వహించనున్నారు. మునగపాకలో పేరుగాంచిన యర్ర వెంకయ్య తోడపెద్దు పాలుకొలుపు కార్యక్రమం రెండు రోజుల పాటు భక్తి శ్రద్ధలతో నిర్వహించనున్నారు. శుక్రవారం సాయంత్రం 7 గంటల తరువాత పట్టాభిదాసుడు సమ్మి వరప్రసాద్ పర్యవేక్షణలో పాలుకొలుపు ఉత్సవం ప్రారంభమవుతుంది. 2వ తేదీన ఉదయం 5.29 గంటలకు తిరు పాలుకొలుపు వేడుక జరుగుతుంది. ఈ కార్యక్రమంలో జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన 17 సింహాద్రప్పన్న ఎద్దులతో పాటు సేవగరిడీలు రానున్నాయని నిర్వాహకులు తెలిపారు. 2వ తేదీన భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు.

టీచర్లకు ఎంఈవో సూచనలు


టీచర్ల సూచలిస్తున్న ఎంఈవో మల్లేశ్వరరావు

గంగవరం : ఉపాధ్యాయులకు బోధనా సామర్థ్యం మెరుగుకు స్కూల్ కాంప్లెక్ సమావేశాలు ఎంతో దోహదపడతాయని ఎంఈవో-2 మల్లేశ్వరరావు అన్నారు. నెల్లిపూడి, గంగవరంలో సమావేశాలను ఎంఈవో-2 పరిశీలించి పలు సూచనలు చేశారు.

గ్యాస్ ధరల తగ్గింపుపై హర్షం


ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మహిళలు

హుకుంపేట: గ్యాస్ ధరలు తగ్గించడంపై గిరిజన మహిళలు హర్షం వ్యక్తం చేశారు. మండలంలోని మఠం పంచాయతీ కేంద్రంలో సర్పంచ్ మఠం శాంతి కుమారి ఆధ్వర్యంలో గిరిజనులు కలిసి ప్రధాని మోదీ చిత్రపటానికి గురువారం క్షీరాభిషేకం చేశారు. బీజేపీ నేతలు మత్యకొండబాబు, నాయుడు పాల్గొన్నారు.

రైతులకు రాజ్‌మా విత్తనాల పంపిణీ


రైతులకు విత్తనాలను పంపిణీ చేస్తున్న అగ్రికల్చర్ సిబ్బంది దీపక, కుమారి

అనంతగిరి:మండల కేంద్రంలోని గిరిజన రైతులకు అనంతగిరి, ఎగువశోభ అగ్రికల్చర్ అసిస్టెంట్‌లు దీపిక, కుమారి రైతులకు రాజ్‌మా, విత్తన శుద్ధి పౌడర్‌ను బుధవారం పంపిణీ చేశారు. ప్రభుత్వం రైతులకు మేలు చేసేలా రాజ్‌మా, విత్తన శుద్ధి పౌడర్‌ను అందిస్తుందని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని, రైతులకు అపోహాలు పెట్టుకోద్దని, అవగాహన కల్పించారు. గిరిజన రైతులు ఆర్థికంగా ఎదగాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలోని గిరిజనులు రైతులు పాల్గొన్నారు.

సామాజిక భవనం పనులకు శంకుస్థాపన


పనులకు శంకుస్థాపన చేస్తున్న వైస్ ఎంపీపీ సుమాంజలి, మండల పార్టీ అధ్యక్షుడు గాసి

అరకులోయ రూరల్: మండలంలో సుంకరమెట్ట పంచాయతీ కేంద్రంలో సామాజిక భవనం నిర్మాణ పనులకు వైస్ ఎంపీపీ కొర్రా సుమాంజలి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గాసి, నేతలతో గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో సామాజిక భవనం కోసం గతంలో అరకు ఎంపీ గొడ్డేటి మాధవికి విన్నవించగా, ఆమె స్పందించి రూ.10లక్షల ఎంపీ నిధులు మంజూరు చేశారన్నారు. సామాజిక భవనం అందుబాటులోకి వస్తే స్థానికులకు ఎంతో సౌకర్యంగా ఉంటుందన్నారు. సర్పంచ్ చిన్నబాబు, వైస్ సర్పంచ్ ఆశాలత, సచివాలయం కన్వీనర్ గణేష్, వార్డు మెంబర్ శశికళ, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

వ్యసనాలకు దూరంగా ఉండాలి


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ హరి, వేదికపై కళాశాల ప్రిన్సిపాల్ భరత్‌కుమార్‌నాయక్

అరకులోయ రూరల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ భరత్‌కుమార్‌నాయక్ ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హరి అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. మద్యం, డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే అనర్థాలను గ్రామస్తులకు విద్యార్థులు వివరించాలన్నారు. క్రమశిక్షణతో చదివి ఉన్నతులుగా ఎదగాలని ఆకాంక్షించారు. ప్రిన్సిపాల్ భరత్‌కుమార్‌నాయక్ మాట్లాడుతూ లక్ష్యంతో చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చన్నారు. మహిళ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ జలపతిరావు, పుష్పరాజు, అధ్యాపకులు సుందరిరాణి, గణేష్, అనితకుమారి తదితరులు పాల్గొన్నారు.

అడుగులపుట్టులో పోస్టల్ సేవలు


అడుగులపుట్టులో బ్రాంచి పోస్టాఫీసును ప్రారంభిస్తున్న బీపీఎం, నాయకులు

పెదబయలు: మండలంలోని అడుగులపుట్టు పంచాయతీ కేంద్రంలోని తాత్కాలిక భవనంలో బ్రాంచి పోస్టు ఆఫీసును ప్రారంభించినట్టు పోస్టుమాస్టర్ చెండా లోయితాసుడు చెప్పారు. ఆయన మాట్లాడుతూ అడుగులపుట్టు గ్రామంలో నిరుపయోగంగా ఉన్న వెలుగు శాఖకు చెందిన భవనంలో పోస్టాఫీసు సేవలు అందుబాటులో తీసుకొచ్చామని, పంచాయతీ వాసులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సర్పంచ్ కొర్ర వరలక్ష్మి, వైస్ సర్పంచ్ త్రినాథ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ జి.ధనలక్ష్మి, మాజీ ఎంపీటీసీ కృష్ణారావు, నాయకులు గున్నమ్మ, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా వినియోగదారుల కమిటీ ఎన్నిక


జిల్లా వినియోగదారుల సంఘం చైర్మన్‌గా ఎన్నికైన చిట్టిబాబును సన్మానిస్తున్న సభ్యులు

పాడేరు రూరల్ : వినియోగదారుల సమాఖ్య జిల్లా నూతన కార్యవర్గ ఎన్నికలు గురువారం పాడేరులో జరిగాయి. వినియోగదారుల సమాఖ్య జిల్లా చైర్మన్‌గా బూడిదే చిట్టిబాబును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా బాడంగి సూర్యకళ, ఉపాధ్యక్షులుగా వి.ధర్మయ్య, ఉప కార్యదర్శిగా తెడబారికి ముత్యాలమ్మ, కోశాధికారిగా చెండా లోహితాస్, ప్రచార కార్యదర్శిగా పప్పు సన్యాసినాయుడు, గౌరవ అధ్యక్షుడిగా కూడా మత్స్యయ్య, సలహాదారుడిగా పి.చిట్టిబాబు జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా ఆర్.రవణమ్మ, కె.సరస్వతి తదితరులను ఎన్నుకున్నారు. వినియోగదారుల హక్కులు, బాధ్యతలపై అవగాహన కల్పిస్తామని నూతన చైర్మన్ బూడిద చిట్టిబాబు స్పష్టం చేశారు.

రోడ్డు పనుల పరిశీలన


రింగురోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎంపీపీ శెట్టి నీలవేణి, సర్పంచ్ సింహాద్రి

అనంతగిరి: మండలంలోని ఎగువశోభ పంచాయతీలోని పలు గ్రామాల్లో ఎంపీపీ శెట్టి నీలవేణి గురువారం పర్యటించారు. బొర్రా నుంచి ఎగువశోభ నిర్మాణంలో ఉన్న తారురోడ్డు పనులను ఆమె పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ నాణ్యత ప్రమాణాలతో పనులు చేపట్టాలని, సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్‌లను ఆదేశించారు. మర్దగుడ- జామిగుడ వరకు రోడ్డు, ఎగువశోభలోని తాగునీటి సమస్యలను స్థానికులు తెలియజేశారు. దీనిపై ఆమె స్పందించి ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సర్పంచ్ సింహాద్రి, కో-ఆప్షన్ సభ్యుడు మదీనా తదితరులు పాల్గొన్నారు.

మండల సమావేశంలో వెల్లువెత్తిన సమస్యలు



మాట్లాడుతున్న ఎస్టీ కమిషన్ సభ్యుడు మురళి

చింతూరు: ప్రజా సమస్యల పరిష్కారానికి నిర్వహించే సమావేశాలకు అధికారులు రాకుంటే సమస్యలు ఎలా తీరుతాయని ప్రజా ప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీపీ సవలం అధ్యక్షతన గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశానికి చాలామంది అధికారులు హాజరు కాకుండా కిందిస్థాయి సిబ్బందిని పంపడంపై ప్రజా ప్రతినిధులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎస్టీ కమీషన్ సభ్యుడు చిచ్చడి మురళి మాట్లాడుతూ మండలంలోని బొడ్డుగూడెంలో గిరిజనులు ఎన్నో ఏళ్లుగా సాగుచేసుకుంటున్న పోడుభూముల విషయంలో అటవీ అధికారులు ఇబ్బందులు పెడుతున్నారని తెలిపారు.

ఏరియా ఆస్పత్రిలో వంద పడకలను ఏర్పాటు చేయడంతో పాటు ఎక్స్‌రే ప్లాంట్‌కు మరమ్మతులు చేపట్టాలని కోరారు. చింతూరులో మినీ బస్‌డిపో ఏర్పాటుతో పాటు ఎటపాక నుంచి కూనవరం, వీఆర్‌పురం, చింతూరు మీదుగా జిల్లా కేంద్రమైన పాడేరుకు బస్సు సర్వీసు నడపాలని తెలిపారు. అనంతరం ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ స్థానిక కేజీబీవీ కళాశాలలో అధ్యాపకులను నియమించాలని, పాఠశాలల్లో ఆర్‌వో వాటర్ ప్లాంట్‌లను ఏర్పాటు చేయాలని కోరారు. మోతుగూడెం పీహెచ్‌సీలో వైద్యపరీక్షలు నిర్వహించేలా చూడాలని, సిబ్బందిని నియమించాలని, అటవీ అభ్యంతరాలతో నిలిచిపోయిన రహదారులకు అనుమతులు మంజూరు చేయాలని కోరారు. ఐటీడీఏ కేంద్రంగా సదరం క్యాంపు నిర్వహించాలని, పోలవరం సమస్యలు పరిష్కరించాలని, అసైన్‌మెంట్ భూములకు సంబంధించిన సమస్యలను పరిష్కరించాలని విన్నవించారు. రక్షాబంధన్ వేడుక సందర్భంగా మహిళా ప్రజా ప్రతినిధులంతా కలిసి పలు శాఖల అధికారులు, తోటి ప్రజా ప్రతినిధులకు రాఖీలు కట్టారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కారం సుబ్బారావు, ఎంపీడీవో వెంకటరత్నం, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
9676392974, 9390991099

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పాడేరు డివిజన్:
9010973030, 9010234557
Office mail : sakshiadvtvsp@gmail.com